క్లుప్తంగా

పూతలపట్టు సీఐగా సుదర్శన్ ప్రసాద్



పూతలపట్టు : సీఐగా సుదర్శన్ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పూతలపట్టు పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్ కావడంతో మొదటి సీఐగా ఆయన వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ రాంభూపాల్ ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం నుంచి సుదర్శన్ ప్రసాద్ వచ్చారు.

ఎంపీడీవో గౌరి సేవలు మరువలేనివి



గౌరిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

పూతలపట్టు: మండలంలో ఎంపీడీఓ గౌరి అందించిన సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎంపీడీఓ గౌరి బదిలీ అయ్యారు. ఆమెకు శుక్రవారం ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు. బాబురెడ్డి మాట్లాడుతూ మండలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టి మండల రూపురేఖలను మార్చారని కొనియాడారు. సన్మాన గ్రహీత గౌరి మాట్లాడుతూ విధుల్లో తనకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎంపీపీ కుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వర్ రెడ్డి, జెడ్పీటీసీ దేవిక, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారి భద్రత జీవితానికి రక్షణ



మాట్లాడుతున్న షాంశెల్‌హెక్

గుడిపాల: రహదారి భద్రత జీవితానికి రక్షణ అని చెన్నై–బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మిస్తున్న మోంటెకార్లో లిమిటెడ్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ షాంశెల్ హెక్ అన్నారు. శుక్రవారం 35వ జాతీయ రోడ్డుభద్రతా వారోత్సవాల్లో భాగంగా గుడిపాల సీఎస్ఆర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డుభద్రతా వారోత్సవాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

ఉపాధిని వినియోగించుకోండి

యాదమరి: ఉపాధి హామీ పనులను గ్రామీణ ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సింగన్న కోరారు. ఎంపీడీఓ శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనుల్లో కాలువలను శుభ్రం చేసుకోవడం, రైతులు తమ పొలాల్లో ఫారంపాండ్ తీసుకోవడం వంటి పనులు చేసుకోవచ్చన్నారు.

గ్రామస్తులు సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ రవిశంకర్ రెడ్డి

యాదమరి: రాబోయే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు గ్రామస్తులు సహకరించాలని చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి కోరారు. శుక్రవారం సాయంత్రం కాశిరాళ్లలోని ద్రౌపతి ధర్మరాజుల ఆలయంలో స్థానికులకు సమావేశం నిర్వహించారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని చెప్పారు. అనంతరం దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే దిశ యాప్‌లో ఫిర్యాదు చేసిన వెంటనే స్థానిక పోలీసులు వస్తారని వివరించారు.

చెర్లోపల్లెలో ఎన్ఎస్ఎస్ సేవలు

తవణంపల్లె: మండలంలోని చెర్లోపల్లె పంచాయతీలో అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రోగ్రాం ఆఫీసర్ కె. శోభారాణి తెలిపారు. శుక్రవారం చెర్లోపల్లెలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సర్వే చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని విద్యుత్ ఉపకేంద్రాల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈఈ శేషాద్రి శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఐరాల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీఎం సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డాక్టర్ పూర్ణలత గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమన్నారు. కాన్పు చేయించుకున్నవారికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. సీహెచ్ఓ సుగుణవతి, పీహెచ్ఎన్ జీవకళ పాల్గొన్నారు.

మీ ఊర్లో మార్పును గమనించండి

- గత పాలనకు నేటి పాలనకు తేడా గుర్తించండి
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి
- తాళంబేడు పంచాయతీలో పల్లెబాట



చిత్తూరు: విద్యార్థినితో మాట్లాడుతున్న విజయానందరెడ్డి



బంగారుపాళెం: వలంటీర్ల సమావేశంలో డాక్టర్ సునీల్‌కుమార్

చిత్తూరు రూరల్: మీ ఊర్లో మార్పును గమనించండి.. గతంలో టీడీపీ పాలనకు, నేటి జగనన్న పాలనకు తేడా గుర్తించండి... పేదల సంక్షేమాన్ని కాంక్షించేది ఎవరో తెలుసుకోండి.. పాతతరం వాళ్లను వదిలేయండి...మీరు చదువుకున్నోళ్లే కదా.. భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలంటే ఎలాంటి పాలన అవసరమో ప్రజలకు చెప్పండి అంటూ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి ఓ విద్యార్థినితో ముచ్చటించారు. చిత్తూరు మండలం తాళంబేడు పంచాయతీలో ఆయన శుక్రవారం పల్లెబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇల్లూ తిరిగి జగనన్న మేలును వివరించారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాన్ని అందజేశారు. పలు సమస్యలను ప్రజలు విజయానందరెడ్డికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మాయమాటలకు కరిగి మళ్లీ మోసపోకండని అప్రమత్తం చేశారు. ఎన్నికలు దగ్గరపడితే బాబు నోటికొచ్చినట్లు హామీలు గుప్పిస్తున్నారని, ఇవన్నీ కూడా ఓట్లు దండుకోవడానికి మాత్రమేనని గుర్తుచేశారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలు చేశారో ప్రతి ఒక్కరూ గుర్తు తెచ్చుకోవాలన్నారు. వలసవెళ్లిన టీడీపీ నాయకులంతా ఎన్నికలు రాగానే, వలస పక్షుల్లాగా వాలిపోతున్నారని చెప్పారు. జనం మేలు కోరే వ్యక్తికి ఓటేయాలని పిలుపునిచ్చారు. పేదల కోసం పరితపిస్తున్న సీఎం జగనన్నను గెలిపించుకుందామన్నారు. జగనన్నను గెలిపించుకునేందుకు నేను సిద్ధం..మీరు సిద్ధమా..అంటూ ప్రజలను ఉత్సాహపరిచారు. పంచాయతీలోని కొండ్రెడ్డిపల్లి, తాళంబేడు, టి.వేపనల్లి, జంబుగోళంపల్లి ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం టి.వేపనపల్లిలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు, సర్పంచ్‌లు అమరనాథ్‌రెడ్డి, త్యాగరాజులు, భాస్కర్, భాస్కర్‌రెడ్డి, నాయకులు సంపత్, ధర్మారెడ్డి, సుధీర్, సబపతి, మధు తదితరులు పాల్గొన్నారు.

పథకాల పంపిణీలో వలంటీర్లే కీలకం

బంగారుపాళెం: గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు ప్రతి పథకం చేరువయ్యేలా చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. అరగొండ రోడ్డు సమీపంలో కామరాజు గార్డెన్స్ ఆవరణలో శుక్రవారం ఆయన వలంటీర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తొలుత వలంటీర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అత్యంత ఆత్మీయ బంధువులు వలంటీర్లేనని అన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో వలంటీర్ల పనితీరును అభినందించారు. కరోనా సమయంలో ప్రజలకు వలంటీర్లు అందించిన సేవలను గుర్తుచేశారు. వానొచ్చినా, వరదొచ్చినా, కరువొచ్చినా జగనన్న సైన్యం ముందుంటుందన్నారు. సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి వలంటీర్ల ద్వారా ప్రజలకు అవసరమైన సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. రూ.5 వేల గౌరవ వేతనంతో వలంటీర్లు సేవాదృక్పథంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వలంటీర్ల కష్టానికి తగ్గ ఫలితం లభిస్తుందన్నారు. త్వరలో శుభవార్త వింటారని చెప్పారు. రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్ మాట్లాడుతూ, సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తరువాత వలంటీర్లనే గ్రామాల్లో ప్రజలు తలచుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో పింఛన్లు తీసుకోవాలంటే ఎన్నో కష్టాలు పడాల్సివచ్చేదన్నారు. మార్కెట్ కమిటీ, సింగిల్ విండో అధ్యక్షులు నారే సోమశేఖర్, దత్తాత్రేయరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం, ఎంపీటీసీ హేమచంద్ర, ప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సర్దార్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రఘుపతిరాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరాజ, మండల యూత్ అధ్యక్షుడు జగదీష్, ఎన్ఆర్ఐ భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

చిత్తూరు కార్పొరేషన్: ఎంఎన్‌సీ కంపెనీల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు విజయం డిగ్రీ కళాశాల విద్యార్థులు 26మంది ఎంపికయ్యారని ఆ విద్యా సంస్థల చైర్మన్ తేజోమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి వార్షిక వేతనంగా రూ.2.4లక్షలు అందజేయనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలియజేశారన్నారు.

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం

యాదమరి: జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని తహసీల్దార్ దైవాధీనం తెలిపారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్‌ఓలకు తహసీల్దార్, ఎంపీడీఓ సింగన్న సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ఇచ్చిన ఇంటి పట్టాలను వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. సమస్యలు ఉంటే వారికి వివరించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

బైటపల్లిలో ఆరోగ్య సురక్ష



మందులు అందిస్తున్న సర్పంచ్ రామతులసి

పూతలపట్టు: మండలంలోని బైటపల్లి పంచాయతీ మద్దులయ్యగారిపల్లెలో అధికారులు శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. క్యాంపునకు వచ్చిన రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి, మందులను అందజేశారు. అనంతరం కళ్లద్దాలను పంపిణీ చేశారు.

బిల్లు రీడర్స్‌కు ప్రోత్సాహకాలు



బిల్లురీడర్స్‌కు ప్రోత్సాహకాలు అందిస్తున్న ఎస్ఏఓ శ్రీనివాసులు, ఈఈ హరి

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు రూరల్ పరిధిలో వందశాతం నిర్ణీత గడువులోపు విద్యుత్ బిల్లుల రీడింగ్ తీసినందుకు రీడర్స్‌కు ఈఈ హరి ప్రోత్సాహకాలు అందజేశారు. స్థానిక గిరింపేటలోని ఆశాఖ అతిథిగృహంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎస్ఏఓ శ్రీనివాసులు చేతుల మీదుగా వీటిని అందించారు. ప్రతి నెలా 7వతేదీ లోపు విద్యుత్ బిల్లులు రీడింగ్ తీయాల్సి ఉందన్నారు. కానీ గడువు లోపు ఇవ్వడం కుదరడం లేదని ఎస్ఏఓ తెలిపారు. రూరల్ డివిజన్‌లో 6వతేదీ రాత్రి వరకు పనిచేసి రీడింగ్ నమోదు చేశారరు. ఇందుకు ప్రోత్సాహకంగా ఈఈ బహుమతులు అందజేశారన్నారు. మొత్తం ఇద్దరు ఏఈలు, బిల్లు రీడింగ్ కాంట్రాక్టర్లు ఇద్దరు, 32 మంది బిల్లు రీడర్స్‌కు వాల్‌క్లాక్‌లను అందజేశారు. చిత్తూరు అర్బన్ పరిధిలో ప్రభుత్వ బకాయిలు రూ.133.52 కోట్లు, ప్రైవేటు పరంగా రూ.11.97 కోట్లు ఉందన్నారు. రూరల్ పరిధిలో ప్రభుత్వ బకాయిలు రూ.113.97 కోట్లు, ప్రైవేటు పరంగా రూ.1.17 కోట్లు ఉందన్నారు. వర్క్ ఆర్డర్లను ఏఈలు 2019–20 పరంగా క్లోజ్ చేశారని 2021–22 పరంగా ఉన్న పెండింగ్‌లను క్లోజ్ చేస్తున్నట్లు వివరించారు. అనంతరం చిత్తూరు అర్బన్ ఈఈ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఏఓ బ్రహ్మయ్య, ఈఈ పద్మనాభపిళ్లై, డీఈఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, కొండారెడ్డి, సుబ్రమణ్యం, జేఏఓలు, ఏఈలు, సబ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటిస్తేనే దిగుబడి

చిత్తూరు రూరల్: వ్యవసాయంలో సాధారణ పద్ధతిలో కాకుండా మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే రైతులు లాభం పొందవచ్చని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు నాగపద్మిని అన్నారు. చిత్తూరు మండలం తుమ్మింద రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు, కార్యక్రమంలో రైతులు మామిడి పూత దశలో పాటించాల్సిన మెలకువలు, మిరపలో నల్ల తామర పురుగు నివారణ చర్యలపై రైతులకు శిక్షణ కల్పించారు. రైతులకు వివిధ రకాల పంటల్లో వివిధ దశలో పాటించాల్సిన మెలకువలకు సంబంధించిన పుస్తకాలు, కర పత్రాలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిని పద్మజ, తుమ్మింద వ్యవసాయ సహాయకుడు మోహన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.





తుమ్మింద, పైపల్లెలో కరపత్రాలను ఆవిష్కరిస్తున డీఆర్‌సీ ఏడీఏ నాగపద్మిని, వ్యవసాయాధికారులు

ఐరాల: వ్యవసాయంలో రైతులు వివిధ పంటల్లో సమగ్ర యాజయాన్యంతో సాగు ఖర్చు తగ్గించి, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం, సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని అన్నారు. మండలంలోని ఎం.పైపల్లెలో వివిధ పంటల్లో సమగ్ర పంటల యాజమాన్యంపై రైతులకు జిల్లా వనరుల కేంద్రం ఆత్మ ద్వారా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాణ్యమైన దిగుబడులు సాధించడానికి రైతులు విత్తనశుద్ధి, వేపనూనె పిచికారీ, పసుపురంగు, నీలి రంగు, జిగురుపళ్లాలు, పక్షి స్థావరాలు, లింగాకర్షక బుట్టలు, రక్షక పంటలు, ఎర పంటలు సాగు చేయడంతో పాటు సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించడం చాలా ముఖ్యమని వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏఓ పద్మజ, ఏఓ వరలక్ష్మి, వీఏఏ హేమంత్ పాల్గొన్నారు.

పిల్లల్లో నులి పురుగులు నివారిద్దాం



గుడిపాల: ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు తినిపిస్తున్న వైద్యులు

ఐరాల: పిల్లల్లో నులి పురుగులు నివారిద్దామని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, డాక్టర్ పూర్ణలత అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నాంపల్లె పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. వారు మాట్లాడుతూ ఏడాది నుంచి 19 ఏళ్లలోపు ఆల్బెండజోల్ మాత్రలు వేయించుకోవాలన్నారు. ముఖ్యంగా 19 ఏళ్లలోపు పిల్లలపై నులి పురుగులు, ఏలికపాములు, కొంకి పురుగుల ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. ఇవి సంక్రమిస్తే పిల్లల్లో రక్తహీనతకు గురికావడం, పోషకాహారం లోపించడం, కడుపునొప్పితోపాటు శరీరం బలహీనతగా అనిపిస్తుందని తెలిపారు. తదితర లక్షణాలు కనిపిస్తే పిల్లలు నులి పురుగులు సంక్రమించినట్లుగా భావించాలని పేర్కొన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 98.16 శాతం చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రుషేంద్ర బాబు, హెచ్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పూతలపట్టులో

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామతులసీ, సింగిల్‌విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బంగారుపాళెం: మండలంలో 12,059 మందికి శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు తుంబకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ తెలిపారు.

8337 మందికి మాత్రలు

తవణంపల్లె: మండలంలో 8337 మందికి ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్లు వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో 8,398 పిల్లలను ఉండగా 8,337 మందికి మాత్రలు మింగించినట్లు డాక్టర్ వెల్లడించారు. మిగిలిన పిల్లలకు శనివారం మింగిస్తామన్నారు.

గుడిపాలలో 800 మందికి

గుడిపాల: మండలంలోని నరహరిపేట జెడ్పీ హైస్కూల్, సీఎస్ఆర్ కళాశాలలో శుక్రవారం 800 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రమహేష్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, కరస్పాండెంట్ లోకేష్, ఏఎన్ఎం జబసెల్వి పాల్గొన్నారు.

రక్తహీనతకు స్వస్తి

యాదమరి: డీవార్మింగ్ మాత్రలతో పిల్లలో రక్తహీనతకు స్వస్తి పలుకుదాం అని ఎంఈఓ రుక్మిణీ, వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ అన్నారు. మండలంలోని 26 ప్రభుత్వ పాఠశాలలో 5210 మంది ఉండగా వారిలో 5192 మందికి ఆల్బెండజోల్ మాత్రలను వారు మింగించారు. సీహెచ్ఓ లక్ష్మీనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పీసీఆర్ జూనియర్ కళాశాలలో, స్థానిక క్యాంఫర్డ్ పాఠశాలలో విద్యార్థులకు డీపీఈఓ సయ్యద్‌మౌలా డీ వార్మింగ్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్, ప్రభుత్వ అధ్యాపక సంఘం అధ్యక్షులు హేమలత, పీడీ షాజహాన్, ఎన్ఎస్ఎస్ పీఆర్వో చిట్టిబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీ–1 విజయేంద్రరావు, చిత్తూరు, ఎంఈవో సెల్వరాజ్, నగరపాలక ఎంహెచ్ఓ లోకేష్ పాల్గొన్నారు.



యాదమరి: విద్యార్థికి మాత్ర మింగిస్తున్న వైద్యులు అనిల్‌కుమార్ నాయక్



తవణంపల్లె: మాత్రను మింగిస్తున్న డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు



పూతలపట్టు: పాఠశాలలో చిన్నారికి మాత్ర వేస్తున్న వైద్యాధికారులు

రైతులకు పూర్తి అవగాహన అవసరం



రైతులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మీ ప్రసన్న

గుడిపాల: పంటల సాగుపై రైతులకు సంపూర్ణ అవగాహన అవసరమని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రసన్న అన్నారు. వసంతాపురం రైతుభరోసా కేంద్రం ఆవరణలో శుక్రవారం రైతులకు సమగ్ర సస్యరక్షణ, మంచి యాజమాన్య పద్ధతులపై సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వరి, వేరుశనగ, మిరప పంటలో ఆకుముడత పురుగులు, అగ్గితెగులు, తామరపురుగులు, పొగాకు లద్దె పురుగుల నియంత్రణ గురించి తెలియజేశారు. వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలన్నారు. ఆమె మిరప పంటను పరిశీలించి రైతులకు చీడపీడల నివారణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గుడిపాల వ్యవసాయాధికారి మాధవి, అగ్రికల్చర్ అసిస్టెంట్ తులసీరాంరెడ్డి, సోనియా పాల్గొన్నారు.

ఇంటి వద్దే వైద్యం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనుష

గుడిపాల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు పైసా ఖర్చులేకుండా, సమయం వృథా కాకుండా ఇంటివద్దే వైద్యసేవలు అందుతున్నాయని బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ అనుష అన్నారు. మండలంలోని రాసనపల్లెలో శుక్రవారం ఆమె ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 65 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఉమామహేశ్వరి, శిరీష, మల్లిక, అన్నపూర్ణ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలివ్వాలి

చిత్తూరు కార్పొరేషన్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. తమ సమస్యలపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలన్నారు. అనంతరం డీపీఆర్సీ డీసీ షణ్ముగానికి వినతిపత్రం అందజేశారు.

మహిళలే జగనన్న సైన్యం

- మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందాం
- ఆ పార్టీ చిత్తూరు ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి
- జగనన్న ఆసరా కింద మహిళలకు రూ.18.86 కోట్ల పంపిణీ

చిత్తూరు అర్బన్: 'ముఖ్యమంత్రి వైఎస్.జగన్ ప్రతి కార్యక్రమంలో మహిళలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. అది ఆయన బలం, బలహీనత. ఎందుకంటే మహిళలంటే ఓ నమ్మకం. వాళ్లు ఎప్పుడూ ఓట్లను అమ్మకానికి పెట్టరు. గత ఎన్నికల్లో చంద్రబాబు పసుపు–కుంకుమ పేరిట రూ.10 వేలు ఇచ్చినా, మహిళలకు జగనన్నవైపే నిలబడ్డారు. మళ్లీ ఎన్నికలు వస్తున్నాయి. మాయమాటలు చెబుతూ చంద్రబాబు మోసం చేయడానికి వస్తున్నాడు. అలాంటి దగాకోరుల మాటల్ని పక్కనపెట్టి జగనన్నను మళ్లీ సీఎం చేయడానికి ప్రతి మహిళ సిద్ధం కావాలి..' అని చిత్తూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఎంసి.విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరు నగరంలోని 2017 మహిళా సంఘాలకు శుక్రవారం జగనన్న ఆసరా పథకం ద్వారా రూ.18.86 కోట్ల మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించారు. నగర మేయర్ అముద మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. మహిళలు గతంలో చెల్లించిన రుణాలను నాలుగు విడతల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పూర్తిగా అందజేశారని చెప్పారు. ఎన్నికల ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ 2019 ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి నెరవేరుస్తున్నారని, ఇదే సమయంలో డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను నాలుగు విడతల్లో తిరిగి చెల్లించి కోట్లాది కుటుంబాల్లో ఆనందం నింపారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని, పేదరికమే అర్హతగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నట్లు వివరించారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకునే ఇటీవల 50 వేల మంది మహిళలకు సంక్రాంతి కానుకలు అందజేశనట్లు వివరించారు. మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ చిత్తూరులో మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్ ఆదేశాలతో ఏర్పాటు చేసిన మహిళామార్టు ద్వారా రూ.48 లక్షలు లాభాలు వచ్చాయని, ఇందులో రూ.38 లక్షలను ప్రతీ మహిళకు పంచుతున్నట్లు తెలిపారు. మిగిలిన రూ.10 లక్షలతో ఓ కొత్త యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పిల్లల భవిష్యత్ కోసం సీఎం ఆసరా నగదును చెల్లిస్తున్నట్లు కమిషనర్ అరుణ తెలిపారు. అనంతరం మహిళంతా కలిసి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాలికల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు హరిణిరెడ్డి, మధుబాబు, శోభ, కో ఆప్షన్ సభ్యులు చందు, అనూ, మెప్మా పీడీ రాధమ్మ, సీఎంఎం గోపి, సచివాలయ కన్వీనర్లు, ఇతర ప్రముఖ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న విజయానందరెడ్డి, మేయర్ అముద